

సిబిఎస్ఇ ఫలితాల్లో సన్ స్కూల్ విజయకేతనం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్థానిక ది సన్ స్కూల్ విద్యార్థులు సిబిఎస్‌సి టెన్త్ ఫలితాల్లో విజయకేతనం ఎగురవేశారు. సిహెచ్ మానస 487 మార్కులతో ప్రథమస్థానం, వి. శ్రీనిత 485 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచారు. అన్ని సబ్జెక్టుల్లోను ఎ1 గ్రేడులను 9 మంది విద్యార్థులు కైవసం చేసుకున్నారు. పాఠశాల యాజమాన్యం అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులనందరినీ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరక్టర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ విశేష ప్రతిభను కనబరచిన విద్యార్థులను ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రవీంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యదర్శి సన్యాసినాయుడు

రెజ్లర్లపై లైంగిక దాడికి పాల్పడిన

బ్రిజ్ భూషణ్‌ను అరెస్ట్ చేయాలి

ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రెజ్లర్లపై లైంగిక దాడికి పాల్పడిన బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ సింగ్‌ను అరెస్ట్ చేయాలని రౌండ్‌టేబుల్ సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో జెడ్‌పి మినిస్టీరియల్ హాల్‌లో రౌండ్ టేబుల్ సమావేశం ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్ వెంకటేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ దేశం గర్వించదగినట్లు ఒలింపిక్స్‌లో ఎన్నో పథకాలు సాధించిన రెజ్లర్లపై బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ సింగ్ లైంగిక దాడులకు పాల్పడడం అత్యంత దుర్మార్గమైన చర్యని అన్నారు. అతనిపై చర్య తీసుకోవాలని 21 రోజులుగా ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద రెజ్లర్లు ఆందోళన చేస్తున్నా కేంద్రప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమని అన్నారు. బ్రిజ్ భూషణ్ షన్ సింగ్‌పై పోక్సో కేసు చట్టం కింద కేసు పెట్టినప్పటికి కేవలం తన పార్టీ ఎంపి కావడంతో ప్రధానమంత్రి నోరు మెదపకపోవడం భాధాకరమైన విషయమన్నారు. ప్రపంచ ప్రఖ్యాతులుగా పేరు సంపాదించనున్న రెజ్లర్లకు అన్యాయం జరిగినప్పుడు స్పందించని బిజెపి ప్రభుత్వం సామాన్య మహిళలకు రక్షణ కల్పిస్తుందా అని ప్రశ్నించారు. ఎంపి పై చర్యలు తీసుకోవాలని పోరాడుతున్న రెజ్లర్లకు మద్దతుగా ప్రత్యక్ష పోరాటాల్లో భాగస్వామ్యం కావాలని ప్రజలను కోరారు. ఆందోళనలో భాగంగా ఈనెల 15న ఒక రోజు నిరసన దీక్ష, 18న ఆలిండియా పిలుపులో భాగంగా జిల్లా వ్యాప్త నిరసన కార్యక్రమాలు, 20న 2కె రన్ కార్యక్రమాలు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యదర్శి సన్యాసి నాయుడు, కాంగ్రెస్ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సతీష్, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వర్రావు, తిరుపతినాయుడు, ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బి.రాంబాబు, సిఐటియు నగర కార్యదర్శి రమణ, ఐద్వా నాయకులు జగదాంబ, ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యులు సిహెచ్.పావని, గురజాడ విజ్ఞాన కేంద్రం కన్వీనర్ శ్రీనివాసరావు , పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకర్రావు, జెవివి నాయకులు నిర్మల, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రాము, జిల్లా సహాయ కార్యదర్శులు రవి, సౌమ్య, నాయకులు సోమేశ్, సమీరా, లావణ్య, కళ్యాణి, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సతీష్, సహాయ కార్యదర్శి నాయుడు, నాయకులు చంద్ర, ఈశ్వర్రావు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆశయం నెరవేరేనా?

- పర్యవేక్షణ లోపం... స్వచ్ఛ సంకల్పానికి శాపం
- అలంకారప్రాయంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు
- నెరవేరని ప్రభుత్వ లక్ష్యాలు.. నిర్మాణాల్లో జాప్యం

అలంకారప్రాయంగా ఉన్న సంపద సృష్టి కేంద్రం

రోడ్డుపైనే చెత్త

ప్రజాశక్తి-రేగిడి

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగు కోసం ప్రభుత్వాలు స్వచ్ఛ సంకల్పం (చెత్త నుండి సంపద సృష్టి తయారీ కేంద్రాలు) ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. దీంతో కొన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసినప్పటికీ, మరికొన్ని గ్రామాల్లో స్థల సమస్య ఏర్పడింది. మరి కొన్ని పంచాయతీల్లో నిర్మించిన కేంద్రాలు ఆచరణ లేక అలంకారప్రాయంగానే ఉన్నాయి. జిల్లా అధికారులు పర్యవేక్షణ లోపమే స్వచ్ఛ సంకల్పానికి శాపంగా మారింది.

రాజాం నియోజకవర్గం రేగిడి, సంతకవిటి, వంగర, రాజాం మండలాల పరిధిలో 120 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో చేపట్టిన కేంద్రాలు కొన్నిచోట్ల పూర్తి కాగా, మరికొన్ని చోట్ల ఇంకా నిర్మాణ దశలోనే ఉన్నాయి. కేంద్రాలు పూర్తయిన కేంద్రాల్లో చెత్త నుండి సంపద తయారీ మాత్రం జరగడం లేదని పలు గ్రామాల ప్రజలు అంటున్నారు. గ్రామాల్లో చెత్తను తీసుకువచ్చి బహిరంగ ప్రాంతాల్లో వేయడం, అవి దుర్గంధం వెదజల్లడంతో అనారోగ్యం పాలవుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. కొన్నిచోట్ల చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలు లేకపోవడంతో రోడ్లపైనే తడిపొడి చెత్త వేసిన సందర్భాలు కోకొల్లలు. దీంతో స్వచ్ఛ సంకల్ప గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు గ్రామాల్లో చెత్తను ఎత్తేందుకు గ్రీన్ అంబాసిడర్లను నియమించారు. గ్రామ పంచాయతీ వీరికి వేతనాలు, వాహనాలు సమకూరుస్తుంది. గ్రామాల్లో చెత్తను వాహనాల ద్వారా సంపద తయారీ కేంద్రాలకు తీసుకువెళ్లి వాటిని తడి,పొడి చెత్తగా వేరుచేసి ఎరువుగా తయారు చేయాలనే లక్ష్యంతో వీటిని ఏర్పాటు చేశారు. తయారైన ఎరువులు రైతులకు విక్రయించి తద్వారా వచ్చే ఆదాయాన్ని ఆయా గ్రామపంచాయతీలు ఆదాయ వనరులు పెంచుకునే విధంగా ప్రణాళికలు రూపొందించారు. అయితే ఈ ప్రణాళికలు కాగితాల్లోనే తప్ప ఆచరణలో జరగడం లేదు.

రాజాం నియోజకవర్గం పరిధిలో రేగిడి మండలంలో 39 గ్రామపంచాయతీలో ఉండగా 27 పంచాయతీల్లో సంపద సష్టి కేంద్రాలు ఏర్పాటు చేశారు. సంకిలి, ఉంగరాడ, వన్నలి కండ్యాం, కొమిరి, చిన్ని శిర్లాం పంచాయతీల్లో పూర్తిగా నిర్మాణాలు చేపట్టలేదు. కోడిస, అప్పాపురం, దేవుదలలో వివిధస్థాయిలో ఉన్నాయి. సంతకవిటి మండలంలో 34పంచాయతీలకు 23 సంపద తయారీ కేంద్రాలు పూర్తయ్యాయి. మిగిలినవి స్థలాలు లేక పూర్తి కాలేదు. వంగర మండలంలో 27 గ్రామ పంచాయతీలు ఉండగా కేవలం 14 మాత్రమే నిర్మించారు. మిగిలినవి నిర్మించలేదు. రాజాం మండలంలో 20 పంచాయతీలు ఉండగా 14 పూర్తయ్యాయని, మిగిలినవి స్థలాలు లేక నిర్మాణాలు చేపట్టలేదు. జిల్లా అధికారులు సంపద తయారీ కేంద్రాలను పరిశీలించి, పూర్తిస్థాయిలో ప్రభుత్వ లక్ష్యాలు నెరవేరేలా చూడాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

వినియోగానికి చర్యలు తీసుకుంటాం

చెత్త నుండి సంపద తయారీ కేంద్రాల వినియోగానికి చర్యలు తీసుకుంటాం.. గ్రామ పంచాయతీ వారీగా సచివాలయ కార్యదర్శి, మండల స్థాయిలో ఎంపిడిఒ, ఇఒపిఆర్‌డి బాధ్యత తీసుకునేలా ఆదేశాలు జారీ చేస్తాం. ఉపాధి హామీ, వైకెపి అధికారుల సమన్వయంతో ఈ పథకం మరింత పటిష్టంగా నిర్వహిస్తాం. తడి, పొడి చెత్తలను వేరు చేయించి వీటి ద్వారా వ్యవసాయానికి ఎరువుగా రైతులకు అమ్మకాలు జరిపి పంచాయతీ వనరులు పెంపొందించే విధంగా చర్యలు తీసుకుంటాం. స్వచ్ఛ సంకల్ప యూనిట్లు లేని పంచాయతీలకు నిర్మాణాలు చేపడతాం.

- శ్రీధర్ రాజా, డిపిఒ, విజయనగరం

పనులు పూర్తి చేసినా

అందని బిల్లులు

బిల్లు ఇవ్వకుండా అడ్డుకుంటున్న సర్పంచ్ భర్త

ప్రజాశక్తి-లక్కవరపుకోట

మండలంలోని గేదెలవానిపాలెం మాజీ సర్పంచ్ గేదెల నర్సింహ నాయుడు గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేసినా, ప్రభుత్వం నుంచి మంజూరైన బిల్లులు ఇవ్వకుండా సర్పంచ్ భర్త అడ్డు తగులుతున్నారు. దీంతో తీవ్ర దిగ్భ్రాంతికి గురై నర్సింహనాయుడు అనారోగ్యం పాలయ్యారు. ఆ పంచాయతీలో సచివాలయం భవన నిర్మాణం పనులు పూర్తి చేసి 8 నెలలు కిందట ప్రభుత్వానికి అప్పగించడంతో అప్పుడప్పుడు కొంత మొత్తం ముట్టింది. మిగిలిన రూ.9 లక్షలు నిధులు కూడా ప్రభుత్వం మంజూరు చేసినప్పటికీ ఆయనకు బిల్లు అందించకుండా సర్పంచ్ చప్ప కనకలక్ష్మి భర్త విశ్రాంత ఉపాధ్యాయుడు దేవుడు అడ్డుపడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రజాశక్తిలో 'మాజీ సర్పంచ్‌పై కక్షసాధింపు' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీంతో పలువురు వైసిపి నాయకులు స్పందించి ఆయనకు బిల్లు చెల్లించాలని కోరారు. వైసిపి సీనియర్ నాయకుడైన నర్సింహనాయుడు పార్టీకి, ప్రజలకు అనేక సేవలు అందించడమే కాకుండా సచివాలయ భవన నిర్మాణానికి సుమారు రూ.50 లక్షలు విలువచేసే 10 సెంట్లు భూమిని ఉచితంగా ఇచ్చారు. సచివాలయ భవన నిర్మాణ పనులతో పాటు ఆర్.బి.కె భవన నిర్మాణ పనులు పూర్తవడంతో ఆ భవనిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ ఆవాల సత్యనారాయణకు, నరసింహ నాయుడుకు ఈనెల 10 న కార్యదర్శి అరుణ్ కుమార్ చెక్కులు రెడీ చేశారు. సంతకాల కోసం సర్పంచ్ చప్ప కనకలక్ష్మీ వద్దకు వెళ్ళగా ఆవాల సత్యనారాయణ చెక్కులపై సంతకాలు పెట్టి, మాజీసర్పంచ్ నర్సింహనాయుడు చెక్కులపై సంతకాలు పెట్టకుండా నిరాకరించారు. ఈ నేపథ్యంలో అధికారులు కలుగజేసుకొని ఆయన న్యాయం చేయాలని వైసిపి నాయకులు, గ్రామస్తులు కోరుతున్నారు. తాజా, మాజీ సర్పంచులిద్దరూ వైసిపికి చెందిన వారే కావడంతో నియోజకవర్గ నాయకులు కలుగజేసుకొని బిల్లులు ఇప్పించాలని స్థానిక నాయకులు కోరుతున్నారు.

104 ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-శృంగవరపుకోట

తమ సమస్యలు పరిష్కరించాలని ఏడు రోజులుగా వివిధ రూపాల్లో 104 ఉద్యోగులు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. అందులో భాగంగా శనివారం మండలంలోని కొట్టం గ్రామంలో 104 ఉద్యోగులు కోటారావు, మహాలక్ష్మి సమస్యలపై కరపత్రాలు పట్టుకొని నిరసన తెలియజేశారు. సిఎం జగన్ మోహన్ రెడ్డి 2019లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, జిఒ 4459 ప్రకారం పిఎఫ్, ఇఎస్ఐ సక్రమంగా అమలు చేయాలని, 104 సేవలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించాలని డిమాండ్ చేశారు.

కోలుకున్న కొవ్వాడ బాధితులు

ఎమ్మెల్యే బడ్డుకొండ పరామర్శ • కొనసాగుతున్న వైద్య శిబిరం

ప్రజాశక్తి - పూసపాటిరేగ

వివాహ భోజనం వికటించి శుక్రవారం కొవ్వాడలో అస్వస్థతకు గురైన బాధితులంతా కోలుకొని సురక్షితంగా ఇళ్లకు చేరుకున్నారు. బాధితులంతా సురక్షితంగా ఉన్నారని, ఎటువంటి సమస్యా లేదని వైద్యులు డాక్టర్ రాజేష్ వర్మ తెలిపారు. ప్రత్యేకమైన వైద్య బృందాలతో గ్రామంలో మెడికల్ క్యాంపులు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. శనివారం ఉదయాన్నే తహశీల్దార్ ఇమంది భాస్కరరావు, ఎంపిడిఒ జి.రామారావు, విఆర్ఒలు, కార్యదర్శులతో గ్రామానికి చేరుకుని బాధితులను పరామర్శించారు. గ్రామ్మంతా బ్లీచింగ్ చల్లి, తాగునీరు క్లోరినేషన్ చేయాలని కార్యదర్శి ఆదేశాలు జారీ చేసారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా గ్రామంలో అధికారులు, వైద్యులు అందుబాటులో ఉన్నారు. 104, 108 వాహనాలను సిద్ధంగా ఉంచారు. వైద్య సిబ్బంది టీములుగా ఏర్పడి ఇంటింటా తిరిగి బాధ్యతుల క్షేమ సమాచారం అడిగి తెలుసుకుంటున్నారు. గ్రామంలో సగం మంది అస్వస్థతకు గురవడంతో అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని డి ఎం అండ్‌హెచ్ఒ, డిపిఒ ఆదేశించినట్లు అధికారులు చెబుతున్నారు. సకాలంలో స్పందించి వైద్య సేవలు అందించిన వైద్య బృందాలను ఎంపిపి భర్త శ్రీనివాసరావు అభినందించారు.

బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

ఎమ్మెల్యే బడ్డుకొండ పరామర్శ

బాధితులను ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు గ్రామానికి శనివారం చేరుకొని బాధితులను పరామర్శించారు. ఎటువంటి ప్రాణాపాయం లేకపోవడంతో వైద్యులను అభినందించారు. సర్పంచి రఘుతో మాట్లాడుతూ డాక్టర్లు అందుబాటులో ఉంటారని, ఎటువంటి సమస్య ఉన్నా వెంటనే పరీక్షలు జరిపి బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని తెలిపారు. అధికారులంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎంపిపి భర్త శ్రీనివాసరావుతో మాట్లాడుతూ గ్రామంలో పారిశుద్ధ్యం, తాగునీరుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు అప్రమత్తంగా ఉండాలని అన్నారు.

వైద్య సేవలు భేష్ : ఎంపిపి

బాధితులకు వైద్యం అందించి సురక్షితంగా ఇళ్లకు పంపిన వైద్యులతో పాటు ఆరోగ్య సిబ్బందిని ఎంపిపి మహంతి కల్యాణి అభినందించారు. విషయం తెలుసుకున్న క్షణాల్లో సంఘటనా స్థలంతో పాటు పిహెచ్‌సిలకు చేరుకొని సకాలంలో వైద్యం అందించి బాధితులకు ధైర్యం చెప్పామన్నారు. గోవిందపురం, రెల్లివలస, పూసపాటిరేగ పిహెచ్‌సి వైద్యులతో పాటు సుందరపేట సిహెచ్‌సి వైద్యులను అబినందిస్తున్నామన్నారు. 108 వాహనాలు సిబ్బంది విరామంగా బాదితులను తరలించి సకాలంలో ఆసుపత్రిలకు చేర్చడం అబినందనీయమన్నారు. వారితో పాటు మహంతి జనార్ధనరావు, పుప్పాల లక్ష్మినారాయణ, వైఎస్ ఎంపిపిలు సత్యనారాయణ రాజు, అల్లాడ రమేష్, మండల పార్టీ అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు సకాలం స్పందించి గ్రామంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పారు. పూసపాటిరేగ సర్పంచి టి. సీతారాం, కొవ్వాడ సర్పంచి కోట్ల రఘు సేవలను ఎంపిపి కొనియాడారు. పూసపాటిరేగ పిహెచ్‌సి వైద్యురాలు ప్రమీల సేవలు ఎనలేనివన్నారు. వందలాది మంది బాధితులు పిహెచ్‌సికి వస్తే వెంటనే వారిని ప్రాథమిక చికిత్స చేసి సుందరపేట ఆసుపత్రికి పంపించడంలో వైద్యులు ప్రత్యేక పాత్ర పోషించారని అన్నారు.

మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి కల్యాణచక్రవర్తి

చిన్న చిన్న తగాదాలతో కుటుంబాలు విచ్ఛిన్నం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి కల్యాణచక్రవర్తి
- లోక్‌అదాలత్‌లో 10,613 కేసులు పరిష్కారం

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

చిన్న చిన్న తగాదాలతో కుటుంబాలు విచ్ఛిన్నం కారాదని, కుటుంబ సభ్యులు పట్టింపులకు పోయి కలహాలతో చక్కని జీవితాలను పాడుచేసుకోవద్దని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణ్‌చక్రవర్తి అన్నారు. శనివారం జిల్లాలోని అన్ని కోర్టుల్లోనూ జాతీయ లోక్‌అదాలత్ జరిగింది. జిల్లా మొత్తంగా 10,613 కేసులు ఈ సందర్భంగా రాజీ అయ్యాయి. జిల్లా కోర్టులో కక్షిదారులను ఉద్దేశించి న్యాయమూర్తి మాట్లాడారు. ఈ మధ్య కాలంలో కుటుంబ తగాదాలు ఎక్కువగా పెరుగుతున్నాయని, ఆవేదన వ్యక్తం చేశారు. అనవసర కలహాలుమాని పిల్లల భవిష్యత్ కోసం, మనమీద ఆధార పడ్డవారికోసం అహం వీడి రాజీకి రావాలని హితవు పలికారు. పోలీసు స్టేషన్ల చుట్టూ తిరిగి సమయాన్ని, డబ్బును వృథా చేసుకోవద్దని అన్నారు. లోక్‌అదాలత్‌లో భాగంగా విజయనగరం కోర్టులో 3028, పార్వతీపురం 1641, బొబ్బిలి 1447, సాలూరు 1012, శృంగవరపుకోట 418, గజపతినగరం 1066, చీపురుపల్లి 1068, కొత్తవలస 803, కురుపాంలో 130 కేసులు రాజీ అయ్యాయి. జిల్లా కోర్టులో జరిగిన అదాలత్‌లో ఫస్ట్‌క్లాస్‌మెజిస్ట్రేట్ జి.రజని, సికెందర్ భాషా, ఎస్‌సి, ఎస్‌టి కోర్టు న్యాయ మూర్తి ఎమ్. మీనాదేవి, కుటుంబ న్యాయ స్థానం న్యాయమూర్తి కె.నాగమణి, సీనియర్ సివిల్ జడ్జి బిహెచ్‌వి లక్ష్మి కుమారి, సీనియర్ సివిల్ జడ్జి ఎల్. దేవిరత్న కుమారి, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి బి.రమ్య, అడిషనల్ జ్యూడిషల్ మొదటి శ్రేణి న్యాయమూర్తి కె. మోహిదెన్ జమూరుత్ బేగం, మొబైల్ కోర్టున్యాయమూర్తి సిహెచ్ దామోదర రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కక్షిదారులకు మెడికల్ క్యాంపు నిర్వహించారు.

డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

డ్రగ్స్‌కు అలవాటు పడితే జీవితాలు నాశనం అవుతాయని, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ఎస్ఇబి సిఐ ఆర్.జైభీమ్ కోరారు. డ్రగ్స్ నివారణకు స్థానిక రైల్వే స్టేషన్లో శనివారం తనిఖీలు చేశారు. ప్రయాణికుల బ్యాగులు, పార్సిల్ సర్వీస్ బ్యాగులు, బస్తాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. డగ్స్ వినియోగించినా, అమ్మినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ చిన్నంనాయుడు, సిబ్బంది ఉన్నారు.

కాంగ్రెస్ సంబరాలు

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలిలో బాణసంచా కాలుస్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడంతో బొబ్బిలిలోని పార్టీ కార్యాలయం వద్ద పట్టణ అధ్యక్షులు మువ్వల శ్రీనివాసరావు ఆధ్వర్యాన సంబరాలు చేసుకున్నారు. టపాసులు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో పాదయాత్ర బాగా పని చేసిందన్నారు. మోడీ ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరించడం వల్ల కాంగ్రెస్ పార్టీకి కర్ణాటక ప్రజలు బ్రహ్మరథం పట్టారని తెలిపారు. కార్యక్రమంలో పిసిసి సభ్యులు ముగడ వెంకటరమణ, నాయకులు ఆర్.రామకృష్ణ, రాజాన అప్పలనాయుడు, పత్రి రాజు, శ్రీనివాస్, రామారావు, ప్రసాద్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంతో శృంగవరపుకోటలోని దేవి కూడలిలో ఆ పార్టీ మండల అధ్యక్షులు జి.బంగారు నాయుడు ఆధ్వర్యంలో బాణసంచా కాల్చారు. మిఠాయిలను తినిపించుకుని సంబరాలు జరుపుకున్నారు. ముందుగా వినాయక మందిరంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పి.మణిబాబు, ఎస్‌టి సెల్ జిల్లా చైర్మన్ చీమల అచ్చిబాబు, నియోజకవర్గ సమన్వయకర్త నానాజీ, యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, మెంటాడ అప్పారావు పాల్గొన్నారు.

పాలకుల నిర్లక్ష్యానికి పరాకాష్ట

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

అటు ఏనుగుల సంరక్షణ, వాటి నుంచి ప్రజల ప్రాణాల రక్షణ విషయంలో పాలకుల నిర్లక్ష్యం పరాకాష్టకు చేరింది. గడిచిన పదహారేళ్లలో 11ఏనుగులు, 18మంది మనుషులు, పదుల సంఖ్యలో పశువులు చనిపోవడం ఇందుకు తార్కాణంగా చెప్పుకోవచ్చు. అయినా పాలకులు చలించక పోవడం పట్ల జనం అసహ్యించు కుంటున్నారు. అసహనమూ వ్యక్తం చేస్తున్నారు. తాజాగా శుక్రవారం విద్యుదాఘాతంతో ఒకేసారి నాలుగు ఏనుగులు మృత్యువాతపడిన సంఘటన చర్చనీయాంశగా మారింది. ఇంత జరిగినా నేటికీ ఏనుగుల సమస్య రాజకీయ అజెండా కాలేకపోయింది. నవ్విపోదురుగాక నాకేంటి అన్న చందంగా వ్యవహరించడమే ఇందుకు కారణమని జనం చర్చించు కుంటున్నారు. వాస్తవానికి ఏనుగుల సమస్య ఈ నాటిది కాదు. 2007లోనే ఒడిశాలోని లకేరి అటవీ ప్రాంతం నుంచి ఏనుగుల గుంపు అప్పటి ఉమ్మడి జిల్లా నేటి పార్వతీపురం జిల్లాలోకి ప్రవేశించింది. అక్కడ శబ్ధకాలుష్యం ఎక్కువగా ఉండడంతో ఇటువైపు తరలి వచ్చినట్టుగా అప్పటి నుంచీ అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. నాగావళి నదితోపాటు మన్యం జిల్లాలోని కురుపాం, జిఎల్‌పురం, జియ్యమ్మవలస, కొమరాడ, అటు భామిని, సీతంపేట, వీరఘట్టం తదితర మండలాల్లో తోటపల్లి, వట్టిగెడ్డ తదితర జలాశయాలు, ఏజెన్సీలు నిత్యం పారే సెలయేళ్లు ఉండడంతోపాటు చెరకు, అరటి, జీడితోపాటు వరి, మొక్కజొన్న వంటి పంటలు విరివిరిగా సాగవుతున్నాయి. ఇవన్నీ ఏనుగులకు అడ్డాగా మారాయి. పంటలు తినేయడం, ధ్వంసం చేయడం, నదులు, సెలయేళ్లలో నీరుతాగడం, దట్టమైన అటవీ ప్రాంతంలో సేదదీరడం అలవాటుగా మారింది. ఈ క్రమంలో ఇటు మనుషులు, అటు ఏనుగులు చనిపోతున్నా, పంట నష్టంతో రైతులు తీవ్రంగా నష్టపోయినా, మన్యం వాసులు భయం గుప్పెట్లో బతుకీడుస్తున్నా అప్పటి పాలకులు పట్టించుకోలేదు. ఎట్టకులకు 2010లో అప్పటి రాష్ట్ర అటవీశాఖ మంత్రి హయాంలో ఆపరేషన్ గజేంద్ర పేరిట ఏనుగుల తరలింపు కార్యక్రమం చేపట్టినప్పటికీ ఒక ఏనుగులు ఒడిశా వెళ్లాక చనిపోవడంతో ఆ రాష్ట్ర ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది. దీంతో, ఆ కార్యక్రమాన్ని నిలిపివేశారు. ఆ తరువాత స్థానికంగానే ఎలిఫేంట్ జోన్ ఏర్పాటు చేస్తామని ప్రకటించినప్పటికీ ఆచరణలో అమలుకు నోచుకోలేదు. దీంతో, ఏనుగుల గుంపు రాక ప్రారంభం నుంచి నేటి వరకు మొత్తం 18మంది ఏనుగుల దాడిలో ప్రాణాలు కోల్పోయారు. మరికొంతమంది గాయపడ్డారు.

రైతులు ఏటా పంటలు నష్టపోతునే ఉన్నారు. ఇటీవలే ఏనుగు దాడిలో ఓ ట్రాకర్ కూడా బలయ్యాడు. ఇటీవల ఏనుగులు ఏకంగా గ్రామాల్లోకి చొరబడి ఆరు బయట ఉన్న మంచాలు, పొయ్యిలు తదితరాలను ధ్వంసం చేస్తుండడంతో ప్రజల్లో భయాందోళన మరింత పెరిగింది. ఏనుగులను అటవీ ప్రాంతంలోకి తరలించి తమ ప్రాణాలకు భరోసా కల్పించాలని మన్యం వాసులు ఎన్నోసార్లు అటు అధికారులు, ఇటు పాలకులకు వినతులు అందజేశారు. అయినా చీమకుట్టినట్టు కూడా వ్యవహరించకపోవడంతో ఎప్పటి మాదిరిగానే సంచరిస్తున్న ఏనుగుల గుంపులోని నాలుగు ఏనుగులు భామిని మండలం కాట్రగడ్డ వద్ద విద్యుత్‌ఘాతానికి గురై ప్రాణాలు కోల్పోయాయి. దీంతో, ఈ పాలకులు అటు ఇటు మనుషులకు, అటు మృగాలకు రక్షణ కల్పించలేక పోయారనే చర్చ సర్వత్రా సాగుతోంది.

వంతెన నిర్మించాల్సింది ఇక్కడే..

బానాది వంతెనకు మోక్షం లేదా?

ప్రజాశక్తి-వేపాడ

మండలంలో ఆతవ, బానాది గ్రామాల మధ్య ఉన్న గెడ్డపై వంతెనకు మోక్షం కలగడం లేదు. వర్షాకాలంలో ఈ గెడ్డ ఉధృతం ప్రవహిస్తుంటుంది. రెండు, మూడు రోజుల వరకు గెడ్డ ప్రవాహం తగ్గకపోవడంతో బానాది రైతులు కళ్లాల నుంచి ఇళ్లకు వెళ్లేందుకు అవకాశముండదు. దీంతో కళ్లాల్లోనే వంట చేసుకుని బిక్కుబిక్కుమంటూ గడపాల్సి వస్తుంది. ఈ గెడ్డపై వంతెన నిర్మాణం చేపడితే బానాది, ఆతవ గ్రామాలకే కాకుండా ఎఎస్ పేట, సింగరాయి, బల్లంకి గ్రామస్తుల రాకపోకలకూ ఇబ్బందులు తొలగినట్లే. ఆనందపురం వెళ్లాలంటే మూడు కిలోమీటర్ల ప్రయాణం. వంతెన నిర్మాణం చేపకట్టకపోవడం వర్షాకాలంలో వేపాడ మీదుగా ఆనందపురం వెళ్లాలంటే సుమారు 11 కిలోమీటర్లు ప్రయాణించాలి. గతంలో గ్రామ సర్పంచిగా ఉన్న గొంప వెంకటరావు ఉపాధి హామీ నిధులతోపాటు తన సొంత నిధులతో కొంతవరకు మట్టి రోడ్డు ఏర్పాటుచేశారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గెడ్డపై వంతెన నిర్మించాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

వాకింగ్ ట్రాక్ పనులు పూర్తి చేస్తాం

ప్రజాశక్తి-డెంకాడ

మండల కేంద్రంలో సచివాలయం ఎదురుగా ఉన్న కోనేరు గట్టును ఆహ్లాదకరంగా తయారుచేసి వాకింగ్ ట్రాక్ పనులు పూర్తి చేస్తామని పిఎసిఎస్ చైర్మన్ రొంగలి కనక సింహాచలం తెలిపారు. వాకింగ్ ట్రాక్ పనులను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాకింగ్ ట్రాక్ పూర్తయితే గ్రామస్తులకు చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. పిల్లలు ఆటలకు ఏర్పాట్లు చేస్తామని చెప్పారు.



టిడిపిలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే కె.ఎ.నాయుడు

వైసిపిపై ప్రజల్లో అసంతృప్తి

మాజీ ఎమ్మెల్యే కె.ఎ.నాయుడు

ప్రజాశక్తి-దత్తిరాజేరు

వైసిపి ప్రభుత్వంపై ప్రజల్లో రోజురోజుకూ అసంతృప్తి పెరుగుతోందని మాజీ ఎమ్మెల్యే కె.ఎ.నాయుడు తెలిపారు. మండలంలోని పప్పల లింగాలవలస గ్రామానికి చెందిన 120 కుటుంబాలు వైసిపిని వీడి, ఆయన సమక్షంలో శనివారం టిడిపిలో చేరాయి. వారికి కె.ఎ.నాయుడు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు పివివి గోపాలరాజు, మండల అధ్యక్షులు పెద్దింటి మోహన్ రావు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు పెద్దింటి జగన్, బి.బంగారునాయుడు, మజ్జి మహేష్, తెలుగు యువత పార్లమెంటు అధ్యక్షులు వేమలి చైతన్య బాబు, నాయకులు కొండబాబు, రాజు, ఎం.గౌరినాయుడు, కృష్ణ, తాడ్డి రవి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులతో మాట్లాడుతున్న డిఎల్‌డిఎ చైర్మన్ బంగారునాయుడు

విజ్ఞానం.. వినోదం

ప్రజాశక్తి-గుర్ల

గ్రంథాలయాల్లో ఏర్పాటు చేసిన వేసవి శిబిరాలతో విజ్ఞానం, వినోదం లభిస్తాయని డిఎల్‌డిఎ చైర్మన్ బెల్లాన బంగారు నాయుడు తెలిపారు. శనివారం వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఆయన విద్యార్థులతో మాట్లాడి వారు చదువుతున్న పుస్తకాల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో శాఖా గ్రంథాలయ అధికారి పి.రామారావు పాల్గొన్నారు.

క్రాస్‌కంట్రీ పరుగులో పాల్గొన్న క్రీడాకారులు, చిన్నారులు

క్రాస్ కంట్రీ పరుగు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని ధర్మవరం హైస్కూల్ క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న వేసవి బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరంలో భాగంగా శనివారం రెండు కిలోమీటర్ల క్రాస్ కంట్రీ పరుగును ఫిజికల్ డైరెక్టర్ పొట్నూరు శ్రీరాములు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో 75 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. క్రాస్ కంట్రీ పరుగు వల్ల కళాకారుల సామర్థ్యం పెరిగి, కండరాలు అభివృద్ధి చెంది కోర్టులో చురుగ్గా ఉంటారని శ్రీరాములు తెలిపారు. కార్యక్రమంలో పిసి చైర్మన్ టి.రమణ, విశ్రాంత జవాను వెంకట్రావు, కోచ్‌లు బి.హారిక, పి.మౌనిక, యోగా కోచ్ కళ్యాణి పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి వితరణ

ప్రజాశక్తి-వేపాడ

గిరిజన క్రీడాకారులకు సామగ్రి అందజేస్తున్న సర్పంచ్ సతీష్

మండలంలోని చామలాపల్లి పంచాయతీ పరిధిలోని పోతుబందిపాలెం గిరిజన యువకులకు సర్పంచ్ కోలా సతీష్ శనివారం క్రీడా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రీడల్లో మంచి నైపుణ్యాన్ని సంపాదించాలన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడడమే కాకుండా ఆరోగ్యానికి కూడా ఎంతో ప్రయోజనమని తెలిపారు.

ప్రమాదకరంగా మలుపులు

అరసాడ వద్ద ప్రమాదకరంగా ఉన్న మలుపు

- ప్రయాణంలో ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని వేడుకోలు
- పట్టించుకోని అధికారులు

పేపర్ మిల్లు సమీపంలో ప్రమాదకరంగా ఉన్న మలుపు

ప్రజాశక్తి-వంగర

వంగర నుంచి రాజాం పట్టణానికి వెళ్లే ప్రధాన రహదారి ఇరుకుగా ఉంది. పలుచోట్ల మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. దీంతో ఈ రోడ్డు మీదుగా ప్రయాణించే ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. కొంతమంది ప్రాణాలు కోల్పోతున్నారు. రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నా పాలకులు, అధికారులు పట్టించుకునే పరిస్థితి లేదు.

వంగర మండల ప్రజలతోపాటు రేగిడి, రాజాం, గరుగుబిల్లి తదితర మండలాలకు చెందిన ప్రజలు వంగర -రాజాం రోడ్డు మీదుగా నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. శ్రీకాకుళం, విజయనగరం వైపు వెళ్లాలన్నా ఇదే ప్రధాన రహదారి. గతంలో రేగిడి మండలం బూరాడ సెంటర్ నుంచి వంగర మండలం అరసాడ వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టి, అక్కడితో ఆపేశారు. ప్రస్తుతం అరసాడ నుంచి వంగర వరకు ఈ రోడ్డు చాలా ఇరుకుగా ఉంది. ప్రమాదకరంగా మలుపులున్నాయి. రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు భారీగా పెరగడంతో ఎదురుగా వచ్చిన వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ రోడ్డు మీదుగా రాకపోకలు సాగించాలంటేనే ప్రయాణికులు భయపడుతున్నారు, ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణం సాగిస్తున్నారు. ప్రధానంగా మడ్డువలస సమీపంలో, రేగిడి మండలం సరసనాపల్లి పేపర్ మిల్లు వద్ద, కొండవలస, కోడిశ మలుపుల వద్ద, అరసాడలో పలుచోట్ల ఈ రోడ్డు చాలా ప్రమాదకరంగా ఉంది. ఈ రోడ్డులో గోతులు కూడా ఎక్కువగా ఉండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణించడానికి సమయం ఎలాగో ఎక్కువగా అవుతుంది. దీన్ని పక్కన పెడితే, గమ్యస్థానానికి చేరేంతవరకు కూడా ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణించవలసిన పరిస్థితి.

ప్రజలు ఇన్ని ఇబ్బందులు పడుతున్నా ఎవరూ పట్టించుకునే పరిస్థితి లేదు. ఈ రోడ్డుమీదుగా ప్రయాణిస్తున్న పాలకులకు, అధికారులకు కూడా ఈ సమస్య పట్టడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని, అప్పటివరకు మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయాలని పలువురు కోరుతున్నారు.

రెజ్లర్లపై లైంగిక వేధింపులు దుర్మార్గం

రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న అథ్లెటిక్స్ కోచ్ రావు శ్రీనివాసరావు

ప్రజాశక్తి-బొబ్బిలి

క్రీడల్లో రాణించి దేశానికి గుర్తింపు తెస్తున్న రెజ్లర్లపై ఎంపి బ్రిజ్ భూషణ్ లైంగిక వేధింపులకు పాల్పడడం దుర్మార్గమని వక్తలు ఆగ్రహం వ్యక్తంచేశారు. రెజ్లర్ల పోరాటానికి మద్దతుగా శనివారం ఇందిరాగాంధీ డిగ్రీ కళాశాలలో యుటిఎఫ్, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, సిఐటియు ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ లైంగిక వేధింపులకు పాల్పడిన బ్రిజ్ భూషణ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రెజ్లర్లు ఆందోళన చేస్తే పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. బ్రిజ్ భూషణ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే రెజ్లర్లకు మద్దతుగా పోరాటం చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి, ఎఐటియుసి జిల్లా నాయకులు ఎం.శ్రీనివాసరావు, అథ్లెటిక్స్ కోచ్ రావు శ్రీనివాసరావు, తైక్వాండో అసోసియేషన్ సభ్యులు బి.ప్రసాద్, బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు అపర్ణబాబా, యుటిఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ప్రసన్నకుమార్, పిసిసి సభ్యులు మువ్వల శ్రీనివాసరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మణికుమార్, సిఐటియు పట్టణ కార్యదర్శి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యోగోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం కోట

సామరస్య జీవన విధానంలో యోగా ప్రాముఖ్యతను, ఆవశ్యకతను తెలియజేస్తూ విస్తత ప్రచారం కల్పించడమే లక్ష్యంగా ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మొరార్జీ దేశాయ్ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ యోగా, గీతం విశ్వవిద్యాలయం సౌజన్యంతో శనివారం కోటలో యోగోత్సవం నిర్వహించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని 100 రోజుల కౌంట్ డౌన్ ప్రక్రియలో భాగంగా చేపట్టిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లాలోని పలు సంస్థలు, ప్రభుత్వ విభాగాల నుంచి పాఠశాలల నుంచి సుమారు 1,000 మంది పాల్గొని ప్రత్యేక సాధన చేశారు. ఇంకా 39 రోజులు ఉన్న నేపథ్యంలో యోగా ఫర్ హార్మోనియస్ లివింగ్ థీమ్‌తో చేపట్టిన కార్యక్రమానికి స్థానిక ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా గీతం యూనివర్సిటీ అప్లైయిడ్ సైకాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ కె.సునీత మాట్లాడుతూ యోగా ప్రాశస్త్యాన్ని, ప్రయోజనాలను వివరించారు. శారీరకంగా, మానసికంగా ధృడంగా తయారయ్యేందుకు యోగా ఎంతగానో దోహదపడుతోందని పేర్కొన్నారు. యోగాను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ఏటా జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని గుర్తు చేశారు. ఆయుష్ మంత్రిత్వశాఖ, మొరార్జీ దేశాయ్ యోగ జాతీయ సంస్థ ఆధ్వర్యంలో యోగా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించేందుకు దేశంలోని పలు విశ్వవిద్యాలయాలను ఎంపిక చేశారని చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో విజయనగరం, విశాఖపట్నం నగరాలను మాత్రమే ఈ కార్యక్రమం నిర్వహించేందుకు ఎంపిక చేయడం గర్వకారణమని పేర్కొన్నారు.

యోగాసనాలు వేస్తున్న యువత, చిన్నారులు

యోగా కాన్షియస్‌నెస్ ట్రస్ట్ అధ్యక్షులు టిఎల్ నరసింహారావు, గీతం యూనివర్సిటీలో ప్రొఫెసర్ బి. నళిని, ఎం.ఆర్. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సూర్యకాంతి, పోలీసు శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆనందబాబు, సత్య గ్రూపు విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎం. శశిభూషణరావు యోగా ప్రయోజనాలను వివరించారు. జిల్లాకు చెందిన అధికారులు, మాన్సాస్ ట్రస్ట్, బుద్ధ యోగా ఫౌండేషన్, ఎంవీజీఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, సీతం, రఘు, లెండి ఇంజినీరింగ్ కాలేజీలు, రామా స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ విద్యార్థులు, పోలీస్ ట్రైనింగ్ కళాశాల శిక్షకులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

పథకాలకు అర్హతే ప్రామాణికం

'గడపగడపకు..'లో డిప్యూటీ సిఎం రాజన్నదొర



ప్రభుత్వ పథకాల కరపత్రాలను పంపిణీ చేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి- మెంటాడ

అర్హతే ప్రామాణికంగా, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అనేక పథకాలు అమలు చేస్తున్నామని డిప్యూటీ సిఎం పీడిక రాజన్నదొర తెలిపారు. శనివారం మండలంలోని పెదమేడపల్లి గ్రామంలో రెండో రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఆయనకు అడుగడుగునా గ్రామస్తులు బ్రహ్మరథం పట్టారు. అనంతరం ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, అభివృద్ధి పనులను వివరించారు. ఇంకా ఎవరికైనా, ఏ లోపం వల్లనైనా సంక్షేమ పథకాలు అందకపోతే తెలియజేయాలని కోరారు. పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను అక్కడికక్కడే వివిధ శాఖల అధికారుల ద్వారా పరిష్కరించారు. ప్రతి సంక్షేమ పథకం ప్రజలందరికీ చేరాలని ఆయన అన్నారు. ఇతరత్రా సమస్యలు ఏమైనా ఉంటే వాటి పరిష్కారానికే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

కార్యక్రమంలో ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడు, వైస్ ఎంపిపి సారికి ఈశ్వరరావు, లెంక రత్నాకర్ నాయుడు, సర్పంచ్ బోనెల ప్రకాశమ్మ, సీనియర్ నాయకులు పి.అప్పలనాయుడు, మరడ సింహాచలం, ఎస్‌సి సెల్ మండల కన్వీనర్ వడ్డి జనార్దన్, ఎస్‌సి, ఎస్‌టి ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు వడ్డి చిన్నారావు, మండల సచివాలయ కన్వీనర్ కనిమెరక త్రినాథ్, వైసిపి జిల్లా కార్యదర్శి డి.దేవుడు, బొడ్డు బుచ్చియ్య, రెడ్డి రాజప్పలనాయుడు, బి.అప్పారావు, ఎంపిడిఒ త్రివిక్రమరావు, హౌసింగ్ ఎఇ డేవిడ్ రాజ్, ఎపిఎం జి.దేవుడు, దాట్ల హనుమంత రాజు, తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతుల పక్షాన ఉద్యమం

ప్రజాశక్తి-రేగిడి

సహకార రంగంలో పాల డెయిరీలను మూలనపెట్టే చర్యలు మానుకోవాలని, పాడి రైతులకు నష్టం కలిగిస్తే వారి పక్షాన ఉద్యమిస్తామని ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుడితి అప్పలనాయుడు, నియోజకవర్గ అధ్యక్ష ,కార్యదర్శులు నారు జనార్దనరావు, పాలవలస రామినాయుడు తెలిపారు. శనివారం సంకిలి గ్రామంలో స్థానిక విలేకరులతో వారు మాట్లాడారు. గుజరాత్ రాష్ట్రానికి చెందిన అమూల్ డెయిరీపై ఎందుకు ప్రభుత్వం అంత ప్రేమ చూపిస్తోందని ప్రశ్నించారు. గోశాల బిల్లులు ఎప్పుడు చెల్లిస్తారో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. పాదయాత్ర సందర్భంగా ముఖ్యమంత్రి ఇచ్చిన మాట ప్రకారం లీటర్ పాలకు నాలుగు రూపాయల ప్రోత్సాహకం, పశువుల పెంపకాన్ని ప్రోత్సహించడానికి 70 శాతం రాయితీతో దానా ఇవ్వాలని, బ్రీడ్ సీడ్ ఉచితంగా పాడి రైతుల సరఫరా చేయాలని కోరారు. వీటిపై పాడి రైతులతో సంతకాల సేకరణతో ఉద్యమానికి శ్రీకారం చుడుతున్నట్లు వివరించారు.

బొబ్బిలి.. లోక్ అదాలత్ నిర్వహిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి వాసుదేవన్

కొత్తవలస.. లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి విజయ్‌చందర్

సత్వర న్యాయం కోసమే లోక్ అదాలత్

ప్రజాశక్తి-బొబ్బిలి

సత్వర న్యాయం కోసమే జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు సీనియర్ సివిల్ జడ్జి టి.వాసుదేవన్ తెలిపారు. స్థానిక కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. లోక్ అదాలత్‌లో 1447 కేసులను పరిష్కరించారు. ప్రోనోట్ కేసులు 6, పార్టిషన్ కేసులు ఒకటి, టైటిల్ కేసులు 2, ఇపి 2, చెక్ బౌన్స్ ఒకటి, పోలీస్ కేలండర్ 34, మనోవర్తి ఒకటి, అడ్మిషన్ కేసులు 8, ఎస్‌టిసి కేసులు 1377, ప్రీలిటిగేషన్ కేసులు 15 పరిష్కరించారు. రాజీయే రాజమార్గమని న్యాయమూర్తులు వాసుదేవన్, సరోజనమ్మ, సౌమ్య జోసెఫ్ ఫైన్ అన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు, పోలీసులు, కక్షిదారులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : రాజీయే రాజమార్గమని, కోర్టు కేసు రాజీ చేసుకున్న కక్షిదారులు ఇద్దరూ విజయం సాధించినట్టేనని ఎస్.కోట జూనియర్ సివిల్ జడ్జి సబ్బవరపు వాణి అన్నారు. శృంగవరపుకోట కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో సివిల్ దావాలు-13, చెక్ బౌన్స్ కేసులు-13, ఇపిలు-3, క్రిమినల్ కేసులు-7, పెట్టీ కేసులు-377 (సెకెండ్ క్లాస్ కోర్టు) మొత్తం 413 కేసులను న్యాయమూర్తి వాణి పరిష్కరించారు. ముందుగా న్యాయమూర్తి మాట్లాడుతూ రాజీ పడదగిన క్రిమినల్, సివిల్ కేసులతోపాటు మనోవర్తి వంటి కేసులు పరిష్కరించేందుకు కక్షిదారులు ముందుకు రావాలని కోరారు. లోక్ అదాలత్ ద్వారా ఇచ్చిన తీర్పులకు అప్పీలు తీసుకునే అధికారం లేదని వివరించారు. అందువల్ల కక్షిదారులు, అర్జీదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు అల్లు సత్యాజీ, ఎపిపి పి.కేశవరావు, కార్యదర్శి డబ్ల్యు.ఎన్.శర్మ, న్యాయవాదులు నానిగిరి తులసీదాసు, బి.త్రిమూర్తులు, మామిడి చంద్రశేఖర్, టివిఎస్ సన్యాసిరావు, వారాది ఈశ్వరరావు, జి.చిట్టిబాబు, బివిఎస్ రామారావు, ఆర్.సత్యనారాయణ, టివిఆర్ మూర్తి, ఎం.అప్పారావు, బి.సత్యనారాయణ, ఎం.అనూరాధ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస : జాతీయ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ఎస్.విజయ్ చందర్ తెలిపారు. స్థానిక కోర్టు ఆవరణలో శనివారం లోక్ అదాలత్‌ను నిర్వహించారు. కోర్టులో 790 కేసులు రాజీ చేశారు. కార్యక్రమంలో సిఐ ఎస్.బాల సూర్యారావు, ఎపిపి రవణమ్మ, కొత్తవలస బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.మహేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ శ్రీరామ్మూర్తి, సీనియర్ న్యాయవాదులు గొడుగుల మహేంద్ర, కోర్టు సూపరింటెండెంట్ వై.ఉపేంద్ర కుమార్ పాల్గొన్నారు.

17, 18న చాగంటి ప్రవచనాలు

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక రాజా కళాశాల మైదానంలో ఈ నెల 17, 18న చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలు ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ మాజీ చైర్మన్ బేబినాయన తెలిపారు. కోటలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 15, 16న జరగాల్సిన ఈ కార్యక్రమాన్ని 17, 18కి వాయిదా వేసినట్లు చెప్పారు. 17న సాయంత్రం 6గంటలకు ప్రవచనాలు ప్రారంభం అవుతాయన్నారు. రాజా కళాశాల మైదానంలో ప్రవచనం, 18న ఉదయం విద్యార్థులతో ముఖాముఖి, సాయంత్రం ప్రవచనాలు ఉంటాయని వివరించారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి-గజపతినగరం

రామభద్రపురం మండలం పాతరేగ గ్రామానికి చెందిన పెద్దింటి గణేష్ (25) శనివారం మండలంలోని మరుపల్లి వద్ద జాతీయ రహదారిపై అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. రోడ్డు ప్రమాదానికి గురైనట్లు భావించి గ్రామస్తులు 108 వాహనానికి సమాచారం ఇవ్వడంతో సిబ్బందికి అక్కడి చేరుకుని, విగతజీవిగా ఉండటంతో వెనుదిరిగారు. కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని పోలీసులకు సమాచారమిచ్చారు. గణేష్ విజయనగరంలోని ప్రయివేటు బ్యాంకులో పనిచేస్తున్నాడు. గణేష్ తండ్రి చిన్నంనాయుడు ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గంగరాజు తెలిపారు.

గ్రామాల్లో అభివృద్ధి శూన్యం

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన

మాట్లాడుతున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన

ప్రజాశక్తి-రామభద్రపురం

వైసిపి పాలనలో గ్రామాల్లో చేసిన అభివృద్ధి శూన్యమని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన తెలిపారు. శనివారం స్థానిక టిడిపి కార్యాలయంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చింతల రామకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఎక్కడా అభివృద్ధి జాడ లేదని, వైసిపి పాలనతో ప్రజలు విసుగు చెందారని చెప్పారు. కనీసం రోడ్లు కూడా వేసుకోలేని పరిస్థితుల్లో పంచాయతీలను నిర్వీర్యం చేశారని దుయ్యబట్టారు. అప్పుల కుప్పగా రాష్ట్రాన్ని తయారు చేశారని, వైసిపి ప్రభుత్వం మళ్లీ వస్తే ఆంధ్రా మరో శ్రీలంక అవడం ఖాయమని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారని తెలిపారు. ప్రజలు ఇవన్నీ ఆసక్తిగా గమనిస్తున్నారని, వైసిపికి ఓటు వేసే ధైర్యం చేయరని అన్నారు. ప్రతిపక్షాల గొంతు నొక్కే జిఒ 1ని కోర్టు కొట్టి వేయడం ద్వారా ప్రజాస్వామ్యానికి న్యాయం జరిగిందని ఆనందం వ్యక్తం చేశారు. ఇక ప్రజలంతా ఏకతాటిపై నిలిచి టిడిపికి మద్దతివ్వాలని కోరారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు కనిమెరక వెంకటి, మామిడి చిన్నమ్మ తల్లి, కనిమెరక నాగేశ్వరరావు, మజ్జి రమేష్ తదితరులు పాల్గొన్నారు.